వీఆర్ హాస్పిటల్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

- హాస్పిటల్‌ను వెంటనే సీజ్ చేయాలి : సిపిఎం

వీఆర్ హాస్పటల్ ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న బాధితులు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు నగరంలోని వీఆర్ హాస్పిటల్ యజమాన్యంపై కఠినమైన క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, హాస్పిటల్‌ను వెంటనే సీజ్ చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సిపిఎం ఆధ్వర్యంలో వీఆర్ హాస్పిటల్ ఎదుట మహబూబ్‌బాషా అధ్యక్షతన మృతురాలు బంధువులు ధర్నా చేశారు. సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ఎండి షరీఫ్ మాట్లాడుతూ నంద్యాల జిల్లా మిడుతూరు మండలం అలగనూరు నివాసి రజియా తనకు అపెండిక్స్ వ్యాధితో గత సోమవారం హాస్పిటల్ చేరారు. డాక్టర్లు అన్నిరకాల కండిషన్లను చూసి, నీకు అపెండిక్స్ ఆపరేషన్ చేయడానికి మాకు ఆరోగ్యశ్రీ కింద రాదని, రూ.50 వేలు కట్టాలని డిమాండ్ చేశారు. దీంతో పేషెంట్ తరపు వారు రూ.50వేల నగదును కట్టారు. మళ్లీ ఆరోగ్యశ్రీ అప్లమ్ అయిందని, ముందు కట్టిన రూ.50 వేల తిరిగి చెల్లించలేదని తెలిపారు. అపెండిక్స్ ఆపరేషన్ సక్సెస్ అయింది, ఆదివారం డిస్చార్జ్ చేస్తామని డాక్టర్ల ప్రకటించారు. అంతలోనే పేషెంటు ఆదివారం ఉదయమే చనిపోయాడు. పేషెంట్ బంధువులకు, అటెండర్లుకు గాని ఎటువంటి సమాచారం వీఆర్‌హాస్పిటల్ యజమాన్యం, సిబ్బంది తెలపకకుండా శవాన్ని బయట పెట్టారు. ఇది ఎంత దుర్మార్గమని విమర్శించారు. వీఆర్ హాస్పిటల్ డాక్టర్లకు, సిబ్బందికి, ఎటువంటి మానవతా దృక్పథం లేదన్నారు. హాస్పిటల్ వారి నిర్లక్ష్యం వల్ల మా అమ్మాయి రజియా ప్రాణం పోయిందని బంధువులు తెలుసుకొని లబోదిబోమని, కన్నీరు పెట్టుకున్నారన్నారు. వీఆర్ హాస్పిటల్ డాక్టర్లు, సిబ్బంది నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా హాస్పిటల్ ఎదుట ధర్నా చేశారు. పేషెంట్ భర్త, బంధువులైన షేక్షావలి, మాలిక్, రజియా కుటుంబానికి న్యాయం చేయాలని రూ.25 లక్షలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హాస్పిటల్‌ను వెంటనే సీజ్ చేయాలని, వైద్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కర్నూలు నగరంలో ఇటువంటి దారుణాలు వరుసగా మూడోసారి ఈ హాస్పిటల్‌లో జరిగి నప్పటికీ వైద్యాధికారులకు నిద్రమత్తు వదులుకోవడం లేదని విమర్శించారు. ఇటువంటి ప్రవేట్ హాస్పిటల్ల పై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్ల దోపిడీకి తెర లేపారన్నారు. ఈచర్యల వలన ఉన్నతాధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే హాస్పిటల్ యజమాన్యం స్పందించి కనీసం మానవతా దృక్పథంతో రజియా కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాషాభాయ్, నాగశేషులు, మాలిక్, షాక్షావలి మృతురాలి బంధువులు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

మార్క్ ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోలు

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా వెల్లడి
- ఉల్లి మార్కెట్‌ను సందర్శించిన జెసి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

మార్క్ ఫెడ్ ద్వారా రూ.12 కిలో చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఉల్లిని కొనుగోలు చేస్తుందని, అందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఆదివారం మార్కెటింగ్, హార్టికల్చర్, మార్క్‌ఫెడ్, మార్కెట్ యార్డ్ సెక్రెటరీ తదితరులతో ఉల్లి కొనుగోలు అంశం పై జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం నుండి మార్క్ ఫెడ్ ద్వారా మార్కెట్ యార్డ్‌లో ఉల్లి కొనుగోలు ప్రారంభించాలని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఉల్లి నిల్వలను మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మార్క్‌ఫెడ్, మార్కెట్ యార్డ్ సెక్రెటరీలను ఆదేశించారు. రైతు బజార్లకు కూడా తరలించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫీల్డ్‌లో డ్యామేజ్ అయిన ఉల్లి వెరైటీ ఎంత ఉందని కలెక్టర్ ఉద్యాన శాఖ అధికారిని ఆరా తీశారు. ప్రస్తుతం వర్షాలు రాకపోతే డ్యామేజ్ ఏమి ఉండదని, మంచి నాణ్యత ఉంటుందని ఉద్యాన శాఖ అధికారి కలెక్టర్‌కు వివరించారు. కర్నూలు మార్కెట్‌యార్డ్ మాత్రమే కాకుండా పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, కోసిగి ఎఎంసిలలో కూడా ఉల్లి ఆరబెట్టే విధంగా రైతులకు సౌకర్యాలు కల్పించాలని మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, హార్టికల్చర్, మార్క్‌ఫెడ్ , మార్కెట్ యార్డ్ సెక్రెటరీ లతో టీంలు ఏర్పాటు చేసి ఉల్లి కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, మార్క్‌ఫెడ్ డిఎం రాజు, మార్కెటింగ్ ఏడి నారాయణ మూర్తి, కర్నూలు మార్కెట్ యార్డ్ సెక్రెటరీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి ఉల్లి మార్కెట్‌యార్డును జాయింట్ కలెక్టర్ బి.నవ్య సందర్శించారు. రైతులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. ఈ రోజు నుండే మార్క్‌ఫెడ్ ద్వారా క్వింటాకు రూ. 1200 చొప్పున కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అంగీకరించిందని రైతులకు జెసి భరోసానిచ్చారు.



రైతులు, మార్క్‌ఫెడ్ అధికారులతో మాట్లాడుతున్న జెసి

విరమణ ఆశయాలకు, అభిరుచులకు కాదు

- జంధ్యాల రఘు బాబు ఉద్యోగ విరమణ ఆత్మీయ సమావేశంలో తెలకపల్లి రవి, వక్తలు

మాట్లాడుతున్న ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విరమణ ఉద్యోగ సంబంధమైన విషయమే తప్ప వ్యక్తుల, సంస్థల ఆశయాలు అభిరుచులు, ఆసక్తులకు కాదని జంధ్యాల రఘుబాబు భవిష్యత్తులో అభ్యుదయ భావాలతో కూడిన రచనలు చేయాలని పలువురు వక్తలు సూచించారు. మంచితనం మూర్తిభవించిన వ్యక్తి, సాంఘిక, సామాజిక రాజకీయ లలో అభ్యుదయ భావాలు కలిగిన వ్యక్తి అని కొనయాడారు. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ సంస్థలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన జంధ్యాల రఘుబాబు ఆత్మీయ సమావేశం జెవివి నాయకులు ధనుంజయ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా జంధ్యాల రఘుబాబు రచించిన 'అక్షర కాంతులు' సాహిత్య వ్యాసాల పుస్తకాన్ని ఆవిష్కరించారు. తరువాత ఆయన ఉద్యోగ ప్రస్థానంపై ప్రజాశక్తి ప్రచురించిన ప్రత్యేక అనుబంధాన్ని ఆవిష్కరించారు.

ప్రముఖ రాజకీయ విశ్లేషకులు, ప్రజాశక్తి పూర్వ సంపాదకులు తెలకపల్లి రవి మాట్లాడుతూ జంధ్యాల రఘుబాబు మా అమ్మనాన్న టి.నరసింహయ్య, టిసిలక్ష్మమ్మ దగ్గర మా అన్నదమ్ముల కంటే ఎక్కువగా పెరిగారని అన్నారు. మా తల్లిదండ్రులు సిపిఎంలో నిరాడంబరంగా ప్రజల కోసం సేవ చేశారని, రఘుబాబు దానిని కొనసాగించారని అన్నారు. ఉద్యోగ ఉద్యమ కుటుంబ జీవితంలో వివాద రహితుడుగా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఇన్సూరెన్స్ రంగం ముక్కలు చేయకుండా యూనియన్‌గా ఉద్యమాలు చేసి సంస్థను కాపాడుకున్నారన్నారు. ఉద్యోగం అనే పరిమితమైన భావన నుండి విరమణ పొందుతున్నారని అపరిమితమైన పని అయిన రచనలు, పాటలు, సామాజిక ఉద్యమ పరమైన బాధ్యత నుంచి కాదని దానిని మరింత ముందుకు తీసుకెళ్లాలని కోరారు. అందుకు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆవిష్కరించిన అక్షర కాంతులు పుస్తకావిష్కరణే నిదర్శనమని అన్నారు. జె.రఘుబాబు రచించిన అక్షర కాంతులు సాహిత్య వ్యాసాల పుస్తకాన్ని తెలకపల్లిరవి, చంద్రశేఖర కల్కూర ఆవిష్కరించారు. ఆపుస్తకాన్ని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగారు మోహన్ సమీక్షిస్తూ మాట్లాడారు. రాయలసీమ స్థితిగతులపై కరువుపై, వాస్తవ జీవితాలపై రఘుబాబు తన కవిత్వం కథలు పాటలు రాశారని అన్నారు. హాస్య రచనలు రాజకీయ వ్యంగ్య వ్యాసాలు ఆయన శైలి అని కొనియాడారు. ప్రగతిశీల సాహిత్యంలో ఆయన తప్పక ముందుంటారని అన్నారు. సభాధ్యక్షులు ధనుంజయ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ విద్యార్థి ఉద్యమం నుంచి కొనసాగిన ఆయన ఉద్యమ ప్రస్థానం జెవివి, సాహితీస్రవంతి, ఉద్యోగంలో యూనియన్, కుటుంబం అన్నింటినీ సమన్వయం చేసుకోవడం గొప్పవిషయమన్నారు. హైకోర్టు అడ్వకేట్ జయరాజు మాట్లాడుతూ మంచితనం మూర్తిభవించిన వ్యక్తి జంధ్యాల రఘుబాబు అని అన్నారు. సాంఘిక, సామాజిక, రాజకీయ ఉద్యమాల్లో అభ్యుదయ భావాలు కలిగి సమాజం కోసం ఆలోచించి తపన పడే వ్యక్తి అన్నారు. ఉద్యోగం విరమణ తర్వాత తన పూర్తి సమయాన్ని రచనలు వ్యాసాల కోసం కేటాయించి ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు పూర్తి భాగస్వామ్యం ఉండాలని కోరారు. గాడిచర్ల ఫౌండేషన్ ఛైర్మన్ కల్కూరా చంద్రశేఖర్ మాట్లాడుతూ రచయితగా సాహితీవేత్తగా రఘుబాబు మంచి కృషి చేశారన్నారు. ఉద్యోగిగా వృత్తికి న్యాయం చేశారన్నారు. గ్రంథాలయాలు, వార్తాపత్రికల ఆవశ్యకత సమాజానికి ఎంతో ఉందన్నారు. అందకు ప్రభుత్వాలపై బలమైన ఐక్య ఆందోళన, ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జెఎస్ఆర్‌కె శర్మ మాట్లాడుతూ తెలుగు భాష కోసం అందరం కృషి చేయాలని అన్నారు. రఘుబాబు పరిచయమైన నాడు జంధ్యాల బాపయ్య శాస్త్రిని గుర్తు చేసుకున్నానని అన్నారు. తెలకపల్లి చంద్రం మాట్లాడుతూ తాము ముగ్గురం అన్నదమ్ములమైతే రఘుబాబు నాలుగో వాడిగా భావిస్తామన్నారు. రిటైర్మెంట్ ఉద్యోగానికి మాత్రమే అని ప్రజాసేవను మరింత ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ మాట్లాడుతూ ప్రజాఉద్యమాలతో అనుబంధాన్ని కొనసాగించి టి.నరసింహయ్య, లక్ష్మమ్మ ఆశయ సాధన కోసం కృషి చేయాలని అన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని కాపాడే ఉద్యమంలో ఆయన ముందుండున్నారన్నారు. ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ హెడ్ ఆఫీస్‌ను రాయల్ సీమలోనే కొనసాగించాలనే ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారన్నారు. చరిత్ర అధ్యాపకుడు బడేసాహెబ్ మాట్లాడుతూ 30 సంవత్సరాలు జెవివి, సాహితీస్రవంతిలో కలిసి పనిచేశామన్నారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఈ సభకు వచ్చిన ఉద్యోగ ఉపాధ్యాయ రచయిత రైతు కూలీ కార్మిక రంగాల నుండి హాజరు కావడం ఆయనకు ఆయా సంఘాలతో ఉండే సంబంధం గుర్తు చేస్తుందన్నారు. జెవివి నాయకులు డాక్టర్ రాంగోపాల్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగంలో కూడా మంచి సర్వీసు ఇచ్చారని వివిధ రంగాల్లో కూడా బాగా పనిచేశారని అన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ డీన్ అత్తర్ భాను మాట్లాడుతూ సామాజిక ఆర్థిక రాజకీయ రచనల ద్వారా తన వాయిస్‌ను ప్రజలకు అందించారని తెలిపారు. ప్రజాశక్తి కర్నూలుడెస్క్ ఇన్‌ఛార్జి పానుగంటి చంద్రయ్య మాట్లాడుతూ ప్రజాశక్తితో రఘుబాబుకు ఉండే అనుబంధాన్ని పంచుకున్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి అలివేలు, విరసం నాయకులు నాగేశ్వరఆచారి, ఎపిటిఎఫ్ నాయకులు హృదయ రాజు, ఎల్ఐసి నాయకులు సాల్మన్‌రాజు, టి.హరి, ప్రకాశం జిల్లా సాహితీ స్రవంతి నాయకులు నారాయణరావు, నంద్యాల జిల్లా సాహితీ స్రవంతి నాయకులు శ్రీనివాసమూర్తి తదితరులు మాట్లాడారు.

ఉద్యోగ విరమణ స్పెషల్ ఆవిష్కరణ

జంధ్యాల రఘుబాబు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనపై వేసిన ప్రత్యేక కథనం, ప్రముఖుల అభిప్రాయాలతో ప్రచురించిన ప్రజాశక్తి ప్రత్యేక అనుబంధాన్ని తెలకపల్లి రవి, రఘుబాబు, రచయితల చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ ఆవిష్కరణలో ప్రజాశక్తి జనరల్ మేనేజర్ నరసింహ, డెస్క్ ఇంచార్జి పానుగంటి చంద్రయ్య, డివిజన్ ఇంచార్జి ఎం.రాజు, స్టాఫ్ రిపోర్టర్ వినయ్ కుమార్, సిబ్బంది మధు సుబ్బరాయుడు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జంధ్యాల రఘుబాబు సతీమణి శైలాకుమారి, కుమార్తె డాక్టర్ సుస్మిత అల్లుడు డాక్టర్ విజ్ఞాన్, టి హరి,ఇతర బంధువులు జిల్లా సాహితీ స్రవంతి నాయకులు ఆవుల చక్రపాణి, నాగమణి, ప్రముఖ రచయితలు, కవులు కళాకారులు, సాహితీవేతలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం చాటిన ఆత్మీయ సన్మానం

రఘుబాబుకు ఉద్యోగ విరమణ సందర్భంగా దేశంలో సామాజిక ఐక్యతను చిన్నాభిన్నం చేసేలా పాలకుల వ్యవహారం ఉంది. అందుకు భిన్నంగా ఆయన విద్యనేర్పిన గురువులలో మూడు మతాలకు చెందిన వారిని రఘుబాబు దంతపులు ప్రత్యేకంగా సన్మానించారు. ప్రాథమిక విద్యను నేర్పిన ఉపాధ్యాయులు కోటప్ప(హిందవు), ఉద్యోగ ప్రస్థానంలో గురువు టైపిస్టులో శిక్షణ ఇచ్చిన ఎస్ఎ రహీం(ముస్లిం), తను పని చేసే సంస్థలో న్యాయసలహాలు ఇచ్చిన గురువు సీనియర్ న్యాయవాది హైకోర్టు అడ్వకేట్ జయరాజు (క్రిష్టియన్)లను పూలమొక్క, శాలువా, తను రచించిన పుస్తకాలను ఇచ్చి సన్మానించారు. రఘుబాబు మాట్లాడుతూ దేశంలో విద్వేషపూరిత వాతావరణంలో మనం ఉన్నామని నా గురువులుగా భావించిన వీరి భిన్న మతాలకు చెందిన వారిని సన్మానించుకొని దేశం భిన్నత్వంలో ఏకత్వం చాటాలనుకున్నానని అన్నారు. ఈసభకు వచ్చిన తనపై ఉన్న ప్రేమాభిమాన్ని చాటిన వారందికి , కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా సంఘాలు, రంగాలు, కుటుంబ సభ్యులు రఘుబాబు ఘనంగా సన్మానించారు.

జంధ్యాల రఘుబాబు దంపతులను సన్మానిస్తున్న హైకోర్టు న్యాయవాది జయరాజు, ఐలు నాయకులు

మూడు మతాల గురువులను సన్మానిస్తున్న జంధ్యాల రఘుబాబు దంపతులు

వక్కెర వాగు బ్రిడ్జిని పరిశీలిస్తున్న నాయకులు

శిథిలావస్థకు కల్లూరు వక్కెర వాగు బ్రిడ్జి

- పొంచి ఉన్న ప్రమాదం - హైవే, ఆర్ అండ్ బి రోడ్లు గుంతలమయం
- ప్రభుత్వం వెంటనే స్పందించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వినాయక నిమజ్జనం సందర్భంగా కొన్ని ఆర్టిసపి బస్సులను కల్లూరు మీదుగా వెళ్లాలని అధికారులు ఆదేశించారు. గోడలు శిథిలమై ప్రమాదం పొంచి ఉన్న కల్లూరు వక్కెర వాగు బ్రిడ్జిపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని శివారు కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు జి హర్షవర్ధన్ రెడ్డి, జె,వీరి స్వామి, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఆవాజ్ నాయకులు ఎల్.నయుం విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఉదయం పలు సంఘాల ప్రతినిధులతో కలిసి పిపిఎస్ఎస్ ప్రతినిధి బృందం నగరంలోని ప్రధాన రోడ్లపై పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సందర్భంగా ఆర్టిసి బస్సులను కల్లూరు మీదుగా వెళ్లాలని అధికారులు తీసుకున్న నిర్ణయం పై పునర్ సమీక్షించాలని కోరారు. కల్లూరు వక్కెర వాగు బ్రిడ్జి శిథిలావస్థకు చేరిందని మూడేళ్ల క్రితం నాలుగు కోట్ల అంచనా తో ప్రభుత్వానికి సంబంధిత అధికారులు పంపినా ఇంతవరకు గత ప్రభుత్వం గానీ.. ఈ ప్రభుత్వం గానీ స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్అండ్‌బి చేయాల్సిన పనులను నగరపాలక సంస్థ నిధులతో పాత గోడలపై స్లాబు వేయించి గత పాలకులు చేతులు దులుపుకున్నారని విమర్శించారు. నిమజ్జనం సందర్భంగా ఆర్టిసి బస్సులు, స్కూల్ బస్సులు ఇతర వాహనాలతో రద్దీని కల్లూరు వక్కెర వాగు బ్రిడ్జి భరించే పరిస్థితుల్లో లేదని.. వెంటనే కలెక్టర్ స్పందించాలన్నారు. ఆనంద్ టాకీస్ దగ్గర కెసి కెనాల్ బ్రిడ్జి నుండి నీళ్ల కారుతూ ఉండడం వల్ల ప్రజలకు అసౌకర్యంతో పాటు బ్రిడ్జి కూడా ప్రమాదమని అన్నారు. బళ్లారి చౌరస్తా ఆంజనేయ స్వామి విగ్రహం ప్రక్కన హైవే సర్వీస్ రోడ్డు, ఈద్గా దగ్గర మరికొన్ని రోడ్లపై గుంతలు పడి నీరు నిలిచి దిబ్బగుంతలా తయారైనా ఆర్ అండ్ బి,జాతీయ రహదారుల సమస్త శాఖల అధికారులు స్పందించడం పోవడం విచారకరమన్నారు. నగరంలో రోడ్లపై గుంతలను వెంటనే మరమ్మతులు చేసి వర్షం నీరు రోడ్డుపై చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పర్యటనలో పర్యావరణ పరిరక్షణ విభాగం ప్రతినిధి తోట హరికృష్ణ, పిపిఎస్ఎస్ నుండి ఏ వెంకటేశ్వర్లు ఎండి.యూనూస్, సివివర్మ, పి.సత్యప్రసాద్, జి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సిలో ప్రతిభ చాటిన హసీనా

ప్రజాశక్తి-కోడుమూరు

డిఎస్‌సిలో 83.43 సాధించిన హసీనాబీని యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం సందర్భంగా సన్మానం చేశారు. ఆరోగ్యం బాగోలేకున్న విద్యారంగం లో పని చేయాలనే పట్టుదలతో ఎలాంటి కోచింగ్ సుకోకుండా భర్త అబ్దుల్ సలీం సహకారం తో విజయం సాధించింది. స్కూల్ అసిస్టెంట్ సోషల్ విభాగంలో 68.7 సాధించి మంచి ప్రతిభ కనబరిచింది.

టీచర్లను బోధనకే పరిమితం చేయాలి

- 8 నుంచి ప్రచార యాత్ర - 12వ పిఆర్‌సిని నియమించాలి
-ఆర్థిక బకాయిలను చెల్లించాలి -17 నుంచి మండల కేంద్రాల్లో నిరసన
- యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ తీర్మానం

మాట్లాడుతున్న కె.సురేష్ కుమార్

ప్రజాశక్తి - కోడుమూరు

టీచర్లను బోధనకే పరిమితం చేయాలని ఈనెల 8 నుంచి ప్రచార యాత్ర నిర్వహించాలని, 12వ పిఆర్‌సిని నియమించి, ఆర్థిక బకాయిలను చెల్లించాలని ఈనెల 17 నుంచి మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాని యుటిఎఫ్ మధ్యంతర కౌన్సిల్ సమావేశం తీర్మానించింది. యుటిఎఫ్ కోడుమూరు మండల శాఖ ఆధ్వర్యంలో జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం ఆదివారం కోడుమూరులో నిర్వహించారు. రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ పాటి, జిల్లా అధ్యక్షులు రవికుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ప్రభుత్వమని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను చెల్లిస్తామని, పిఆర్‌సిని అమలు చేస్తామని ప్రగల్భాలు పలికి ఇప్పటికి 14 నెలలు గడిచినా ఉ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల పూర్తిగా నిర్లక్ష్య ధోరణితో ఉందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి 12వ పిఆర్‌సిని నియమించి 30శాతం ఐఆర్ అమలు చేయాలని, పెండింగ్‌లోని డిఎలు, ఆర్థిక బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం 2003 డిఎస్‌సి వారిని పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉపాధ్యాయులను బోధనేతర పనులకు ఉ ని ఒకవైపు చెబుతూనే మరొక వైపు రకరకాల యాప్ లతో, వివిధ రకాల శిక్షణలు, ఫార్మేటివ్ అసెస్మెంట్ పుస్తకాలను ఉపాధ్యాయులే పూరించాలనడం ఇతరత్రా కార్యక్రమాలతో ఉపాధ్యా యులను మానసిక క్షోభకు గురి చేస్తోందన్నారు. ఉపాధ్యాయ బదిలీలు ముగిసినప్పటికీ రిలీవర్ లేక ఎక్కడి వాళ్లు అక్కడే ఆగిపోవడంతో ఉపాధ్యాయుల్లో నిరాశ, ఆందోళన నెలకొందన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయుటకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. డిఎస్‌సి ఉపాధ్యాయుల నియామకం తర్వాత బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చెయ్యాలనుకుంటే డిఎస్‌సి ఉపాధ్యాయుల సంఖ్యను పెంచితేతప్ప సాధ్యం కాదన్నారు. ఈ సమస్యలు పరిష్కరించుటకు ప్రభుత్వం ఆ రకంగా చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో సెప్టెంబర్ 8 నుంచి 12 వరకు ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని ప్రచారం యాత్ర కొనసాగోస్తామన్నారు. 12 వ పిఆర్‌సి ఆర్థిక బకాయి లు పెండింగ్ డిఎ ల కోసం సెప్టెంబర్ 17నుంచి 20 వరకూ మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు నిర్వహించ బోతున్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హేమంత్ కుమార్, దావీదు, జీవిత, యోహాను, నీలకంఠ, రామచంద్ర, మద్దిలేటి, మార్క్, మధుశేఖర్, వెంకటేష్, చంద్రశేఖర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సాహిత్య చరిత్రను మలుపు తిప్పిన ఆరుద్ర

- తెలకపల్లి రవి

మాట్లాడుతున్న తెలకపల్లి రవి

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

ఆరుద్ర తెలుగు సాహిత్య చరిత్రను మలుపు తిప్పారని తెలకపల్లి రవి అన్నారు. సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నగరంలోని యుటిఎఫ్ భవనంలో ఆరుద్ర శతజయంతి ముగింపు సభకు ప్రధాన వక్త గా హాజరై ప్రసంగించారు. ముందుగా ఆరుద్ర చిత్ర పటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. ఏది రాస్తే అదే చరిత్ర..ఏం చెబితే అదే ప్రసంగం..అనబడిన కాలంలో వాస్తవసాహిత్యచరిత్రను తెలుగు సాహిత్యలోకానికి అందించడంతో తెలుగు సాహిత్యం కొత్తపుంతలు తొక్కిందని సమగ్రాంధ్రసాహిత్యం పదమూడు సంపుటాలతో తెలుగు పరిశోధకులకు సాహిత్యకారులకు, కవులకు పవిత్రగ్రంథమైందంటే అతిశయోక్తి కాదని ..కవిగా.. చరిత్రకారుడిగా.. నాటకకర్తగా, పద్యకవిగా ఎన్నో రచనలు చేసిన ఆరుద్ర అని అన్నారు. తెలుగు సినీపాటల గేయరచయితగా నవశకాన్ని ఆరంభించారని దాదాపు వేల పాటలు రాసిన ఆరుద్ర సినీసాహిత్య చరిత్రలో అజరామరంగా నిలిచిపోయిన పాటలెన్నో రాశారన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ మాట్లాడుతూ ఆరుద్ర రాసిన రచనలన్నీ నేటికీ ఆదరణ పొందుతున్నాయని కవిత్వమైన, నాటకమైన ఆరుద్ర కలం చేతుల్లో పదునెక్కాయన్నారు. వర్తమాన సాహిత్యలోనూ ఆరుద్ర ధ్రువతారే అన్నారు. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు సభాధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, నాయకులు యుఆర్ఎ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిడుగు జాతీయ పురస్కారం అందుకుంటున్న స్వరూప్ సిన్హా

స్వరూప్ సిన్హాకు గిడుగు జాతీయ పురస్కారం

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్ : తెలంగాణా భాషా సాంస్కతిక శాఖ , గిడుగు రామమూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిడుగు జయంతి, తెలుగు భాషా వేడుకలలో కర్నూలు మోషన్ కళాశాల అధ్యాపకులు, ప్రముఖ కవి, రచయిత డాక్టర్ బివి. స్వరూప్ సిన్హా కథా సంపుటి 'నాతో స్నేహం చెయ్యవూ ?' గిడుగు జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ కార్యదర్శి కళారత్న డాక్టర్ బిక్కి కృష్ణ తెలిపారు. తెలుగు సాహిత్యానికి డాక్టర్ సిన్హా చేస్తున్న సేవలను గుర్తించి, రాయలసీమ గర్వించ దగ్గ రచయితగా ప్రశంసిస్తూ యీ అవార్డు ను బహూకరిస్తున్నా మని ఆయన తెలిపారు. ఆదివారం ఆగస్టు 31న హైద్రాబాద్ రవీంద్రభారతిలో, ఎన్‌టిఆర్ లిటరేచర్ గ్లోబల్ నెట్వర్క్ కమిటీ ఛైర్మన్ టిడి. జనార్ధన్, కళారత్న బిక్కి కృష్ణ, తెలంగాణా భాషా సాంస్కతిక డైరెక్టర్ మామిడి హరికృష్ణ, గిడుగు ఫౌండేషన్ అధ్యక్షురాలు , గిడుగు రామ మూర్తి ముని మనుమరాలు గిడుగు కాంతికృష్ణ చేతుల మీదుగా స్వరూప్ సిన్హాకు పురస్కారాన్ని అందజేశారు.

సిరి శ్రీదత్త గ్రూప్ సభ్యులకు

20 ప్యాకెట్‌ల ఉల్లిగడ్డలు ఉచిత పంపిణీ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్ : కేజీ గంగాధర రెడ్డి సౌజన్యంతో కర్నూలు కార్పొరేషన్ పరిధిలో ని 24 వార్డు లో ఉన్న సిరి శ్రీదత్త పొదుపు గ్రూప్ సభ్యులకు ఒకొక్కరికి 4 కేజీల చొప్పున 500 మంది సభ్యులకు మెప్మా ఆర్పీలు ఎస్. ఉమాదేవి, సి. మంజుల అధ్వర్యములో లక్ష్మీ నగర్ లో పంపిణీ చేశారు. గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ఉడుతా భక్తిగా పది క్వింటాళ్ల ఉల్లి పాయలను లక్ష్మీనగర్ లో నిజాయితీగా నిస్వార్ధంగా గ్రూపుల నిర్వహించు కొంటున్న గ్రూప్ సభ్యులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని అన్నారు.సిరి శ్రీదత్త మహిళ ఐక్య సంఘాలు క్రమశిక్షణతో మంచి ప్రణాళికతో ముందుకెళ్లటం సంతోషం అన్నారు. ఆర్పీలు ఉమాదేవి, సి.మంజుల ఒబిలు ఐక్యత ప్రేమ అభివృద్ధి సాధనవైపు మెలగాలని, నేడు రైతు పండించిన పంటకు ధరలేదు వినియోగదారులు అయిన ప్రజలకు అధిక ధరతో కొనాల్సిన పరిస్థితి ఉందని మధ్య దళారులు బాగు పడుతున్నారన్నారు. తనవంతుగా చేసే కార్యక్రమాలతో పాటు మీ వార్డు అవినీతి లేని గ్రూపులు గా భావించి ఈ కార్యక్రమం చేశామన్నారు. అర్పిలు ఎస్.ఉమా దేవి, సి.మంజుల, సిరి శ్రీదత్త అధ్యక్షులు వి.రాధిక, ఎం.వాణిశ్రీ, కార్య దర్శులు బి.హైమవతి, కె.ఊర్మిల, కోశధికారులు గాండ్ల పద్మజ, చిట్టి ఉపాధ్యాయులు హుశనయ్య, వీధి పెద్దలు శ్రీనివాసరెడ్డి, ఫరీదా, ప్రమీణ పాల్గొన్నారు.

ఉల్లిగడ్డలను పంపిణీ చేస్తున్న గంగాధర్ రెడ్డి

బలవంతపు భూసేకరణ ఆపాలి

- జాతీయ రహదారిపై వైసిపి ధర్నా

ప్రజాశక్తి-ఆలూరు

రాష్ట్ర ప్రభుత్వం అభివద్ధి పేరిట పవర్ గ్రిడ్ నిర్మాణం కొరకు చేస్తున్న సారవంతమైన పంట భూములను బలవంతపు భూసేకరణ ఆపాలని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి, ఆదోని మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం మనేకుర్తి గ్రామంలో మనేకుర్తి, హులేబీడు, కమ్మరచేడు రెవెన్యూ భూములలోని పవర్ గ్రిడ్ బాధిత రైతులకు మద్దతుగా మనేకుర్తి గ్రామంలో జాతీయ రహదారి (167)పై పవర్ గ్రిడ్ కంపెనీకి, కూటమి ప్రభుత్వనికి వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. ఎంఎల్ఏ విరుపాక్షి మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాలను అమితంగా ప్రేమిస్తూ భూములపై ఆదారపడి జీవిస్తున్నమని ఈ భూములు పోతే తమకు ఆత్మహత్యలే శరణ్యం అని చెబుతున్న ప్రభుత్వం మొండి భూసేకరణ చేయడం దూర్మార్గమన్నారు. గ్రామంలో ప్రజాభిప్రాయా సేకరణకు వచ్చిన ఆర్డిఓ పవర్ గ్రిడ్ కంపెనీకి వాత్తాసు పలుకుతూ రైతులు ఒప్పుకుంటే కంపెనీ నుండి 18లక్షలు ఇప్పిస్తామని లేదంటే జనరల్ యాక్ట్ క్రింద కోర్టునుండి 6లక్షలే వస్తాయని భయబ్రాంతులకు గురిచేసి బెదిరింపులకు పాల్పడటమేనని తెలిపారు.రైతు ప్రభుత్వం అంటూనే రైతు చట్టాలను తూట్లు పొడుస్తూ 2013 భూసేకరణ చట్ట ప్రకారం 80శాతం రైతులు


మనేకూరు వద్ద జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న వైసిపి ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

ఒప్పుకుంటేనే పవర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టాలని అన్నారు. సారవంతమైన 191.76 ఎకరాల భూములు కోల్పోతే వారి జీవితాలు నాశనమేనని తెలిపారు. ఇప్పటికైనా రైతుల బాధలను అర్ధం చేసుకొని సాగుకు పనికి రాణి చోట భూసేకరణ చేపట్టాలని తెలిపారు. లేనియెడల రైతులకు మద్దతుగా వైసిపి పోరాటానికి సిద్ధంగా ఉందని తెలిపారు. కార్యక్రమం లో మనేకుర్తి, కమ్మరచేడు గ్రామ రైతులు, వైసిపి నాయకులు మల్లికార్జున రెడ్డి, రామాంజినేయులు, ఈరన్న, నాగరాజు, వీరబద్ర రెడ్డి, భాస్కర్ నాయుడు, మండల కన్వీనర్ మల్లికార్జున, కో కన్వీనర్ వీరేష్, కొట్టాల రాజు తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన వినాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఐదు రోజులు పూజలు అందుకున్న గణపయ్య ఆదివారం నిమజ్జనానికి పయనమయ్యారు పట్టణంలో సుమారు 550 విగ్రహాలు ప్రతిష్టించినట్లు తెలిసింది వాహనాలపై గణపయ్య ప్రతిమలు ఊరేగిస్తూ బ్యాండ్ వాయిద్యాల మధ్య పెద్ద పెద్ద సౌండ్ సిస్టంలో మధ్య భక్తులు నృత్యం చేస్తూ గణపయ్యకు వీడ్కోలు పలికారు. ఈసారి పట్టణంలోనే చందా సాహెబ్ దర్గా అనంత మంగళం స్వామి మీదుగా గణపయ్యలు ఊరేగింపు ఉండడంతో ప్రార్ధన మందిరాలు వద్ద పోలీసులు భారీగా మోహరించారు. సాయంత్రం నిమజ్జనం శోభాయాత్ర ప్రారంభం కావడంతో తెల్లవారుజాము వరకు విగ్రహాలు తరలే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.

బందోబస్తును పరివేక్షించిన ఎస్పి

ఆదోని పట్టణంలో కొనసాగుతున్న వినాయక నిమజ్జనం శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించారు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ఎఎస్పి హుస్సేన్ పీరా, డీఎస్పీ హేమలత, ఒకటో పట్టణ సిఐ శ్రీరామ్‌తో కలిసి మున్సిపల్ రోడ్డు ఎల్పీ స్ట్రీట్ పోలీస్ కంట్రోల్ రూమ్ బంగారు బజార్ ప్రాంతాలలో పర్యటించారు. వినాయక ఘాట్‌కు చేరుకొని నిమజ్జనం జరుగుతున్న తీరును పరిశీలించారు. **ఫొటో: వేలంలో లడ్డును దక్కించుకున్న మారుతీ నాయుడు**

వినాయక లడ్డూకు పోటాపోటీగా వేలం

ఆదోని పట్టణంలో గణేష్ నిమజ్జన ఉత్సవ శోభాయాత్ర ఆదివారం మొదలైంది. విహెచ్‌పి కార్యాలయం ముందు ప్రతిష్టించిన గణేష్‌కు ఐదు రోజులుగా వివిధ రకాల పూజలు చేశారు. నిమజ్జన శోభయాత్ర ప్రారంభానికి

ఆందోనిలో బందోబస్తును పర్యవేక్షిస్తున ఎస్పి విక్రాంత్ పాటిల్ , డిఎస్పిలు

ముందు లడ్డుకు పోటాపోటీగా వేలం నిర్వహించారు. ఈ వేలంపాటకు ఎమ్మెల్సీలు బిటి నాయుడు, డాక్టర్ మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మీనాక్షి నాయుడు, సాయిప్రసాద్‌రెడ్డి, ప్రకాష్‌జైన్, హాజరయ్యారు. ప్రముఖులు గుడిసె అదిక్రిష్ణమ్మ ,తదితరుల సమక్షంలో గణేష్ లడ్డుకు వేలంపాట నిర్వహించారు. గత ఎడాది రూ .1,76 వేలకు పలికింది. ఈసారి వేలంపాట పోటాపోటీ గా సాగింది. రూ.3.60లక్షలకు టిడిపి యువ నాయకుడు మారుతి నాయుడు దక్కించుకున్నారు. గణేష్ ముందు ఉంచిన హుండీని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ రూ.లక్ష 16 వేలకు దక్కించుకున్నారు. హుండీ, లడ్డు కు ఊరేగింపు అనంతరం అక్కడనుండి గణేష్ నిమజ్జన శోభాయాత్ర శ్రీనివాస్ భవన్ మీదుగా కొత్త బ్రిడ్జి రాయనగర్ ఎల్ఎల్‌సి కాల్వకు సాగింది.

లడ్డూ వేలంపాటలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే, ఇతర నాయకులు , నిమజ్జనానికి వెళ్తున్న వినాయక విగ్రహాలు

ప్రహల్లాదరెడ్డికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - నందవరం

గంగవరం గ్రామానికి చెందిన వైసిపి నాయకులు ప్రహల్లాదరెడ్డిని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆదివారం పరామర్శించారు. కొద్ది రోజులుగా క్యాన్సర్ వాదితో బాధపడుతు కర్నూలు ఒమేగా హాస్పిటలో చికిత్స నిమిత్తం ఇంటికి ఆయన

ప్రహ్లాదరెడ్డిని పరామర్శిస్తున్న చెన్నకేశవరెడ్డి

వచ్చారు. విషయం తెలుసుకొన్న మాజీ ఎమ్మెల్యే ఆయన నివాసానికి చేరుకొని పరామర్శించారు. రైతు విభాగపు అధికార ప్రతినిధి గడ్డం నారాయణరెడ్డి, నాగేశ్వర్ రెడ్డి,గ్రామ సర్పంచ్ బైటిగేరీ శివన్న, ఎంపీటీసీ విజయ మోహన్ రెడ్డి, సోమశంకర్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, మాజీ ఎంపిటిసి నరసింహులు, రాజారెడ్డి, మనోహర్ రెడ్డి, రాఘవేంద్ర, దస్తగిరి, రాముడు, రాఘవరెడ్డి, సోమేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో ల్యాబ్‌టెక్నీషియన్ లేక అవస్థలు

- చిప్పగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో టెక్నీషియన్ల కొరత
- గుంతకల్లుకు, ఆలూరుకు వెళుతున్న రోగులు

ప్రజాశక్తి-చిప్పగిరి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ ఆసుపత్రులలో రూ. కోట్ల నిధులు ఖర్చుపెడుతున్నట్లు ప్రకటనలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులలో రక్త, మూత్ర , ఇతర పరిక్షలు నిర్వహించే సిబ్బంది లేదు. చిప్పగిరి మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వచ్చిన రోగులకు వింత అనుభవం ఎదురవుతుంది. ఆస్పత్రిలో అన్ని ఉన్న అల్లుడు నోట్లో శని అన్నట్లు ఆసుపత్రిలో రక్త పరీక్షలు, బిపి, షుగర్, ఒంటి పరీక్షలు, గల్ల పరీక్షలు ఇలాంటివన్నీ కూడా పరీక్షించడానికి ల్యాబ్ టెక్నీషియను లేరు. ల్యాబ్ టెక్నీషియన్ లేక వచ్చిన రోగులందరూ కూడా చిప్పగిరి పక్కనే ఉన్న గుంతకల్లు పట్టణానికి , ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళుతున్న కూడా అక్కడ నిరాశ ఎదురవుతుందని అంటున్నారు. ఇక్కడ ఆస్పత్రి ఉన్నాక అక్కడివెళ్లి అదనపు ఖర్చులు చేయాల్సిన పరిస్థితి దాపురించిందని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అక్కడకు వెళితే మీ ప్రభుత్వ ఆసుపత్రి ఉంది కదా అక్కడనే చూపించుకోవాలని చెబుతున్నారు. ఇక్కడేమో దాదాపు రెండు నెలల నుంచి ల్యాబ్ టెక్నీషియన్ వైద్యాధికారి లేక ఈ పరీక్షలు చేయించుకోవడానికి చాలా ఇబ్బందులు పడుతున్నామని పలువురు

రోగులు బహిరంగంగా మాట్లాడుతున్నారు. చిప్పగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది అంతా ఉన్నప్పటికీ ల్యాబ్ టెక్నీషియన్ లేకుండా ఉండటం వలన రక్త పరీక్షలకు మరో ఆసుపత్రికి పోవల్సిన పరిస్థితి దాపురించింది. చిప్పగిరి ప్రభుత్వ ఆసుపత్రికి ల్యాబ్ టెక్నీషియన్ వైద్య అధికారిని వెంటనే నియమించాలని జిల్లా వైద్యాధికారులను చిప్పగిరి మండల ప్రజలు కోరుతున్నారు.

రక్త పరీక్షలు చేసేవారు తప్పనిసరిగా ఉండాలి- రేణుకమ్మ

చిప్పగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలు, బిపి, షుగర్, వంటి పరీక్షలు, గల్ల పరీక్షలు వంటివి పరీక్షించడానికి తప్పనిసరిగా ల్యాబ్ టెక్నీషియన్, వైద్య అధికారి ఉండాలని, జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నాం. మహిళలు వేరే ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంది. డిఎంహెచ్ఓ స్పందించి మా చిప్పగిరి ఆసుపత్రికి ల్యాబ్ టెక్నీషియన్ వైద్య అధికారులు నియమించాలి.

రక్త పరీక్షలకు మరో ఆసుపత్రికి వెళ్లాలి: పురుషోత్తం



ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రికి వచ్చిన వ్యక్తి చిప్పగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షలు మరే ఇతర పరీక్షలు నిర్వహించే ల్యాబ్ టెక్నీషియన్ వైద్యాధికారి లేకపోవడం వలన మహిళలు చాలా ఇబ్బందులు గురవుతున్నారు. బాలింతలు, గర్భవతులు, ముఖ్యంగా బిపి షుగర్ రక్త పరీక్షలు చెకప్‌కు వచ్చే వారికి అందుబాటులో ఉండే ల్యాబ్ టెక్నీషియన్ వైద్యాధికారి ఉండాలి.

రైతుల భూములను లాక్కొంటే పుట్టగతులుండవు

- సిపిఐ నాయకులు

ప్రజాశక్తి- ఆలూరు

దేశానికి అన్నం పెట్టె రైతే రాజు అని మాటలకే పరిమితం అవుతున్న ప్రభుత్వాలు ఆచరణలో చూపించడం లేదు కానీ రైతుల భూములను లాక్కొంటే వారికి పుట్టగతులుండవని ప్రభుత్వాలు తెలుసుకోవాలని ఏపి రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రామ చంద్రయ్య, సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య అన్నారు.ఆదివారం మనేకుర్తి గ్రామంలో రైతులకు ఇష్టం లేకుండా పవర్ గ్రిడ్ నిర్మాణం కొరకు ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు చేపడుతున్న భూసేకరణకు వ్యతిరేకంగా రైతులకు మద్దతుగా భూములు కోల్పోతున్న రైతుల పంట పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడారు. రామచంద్రయ్య, గిడ్డయ్య మాట్లాడుతూ గ్రామంలో సారవంతమైన భూములను పంటలు పండించుకొని జీవిస్తున్న రైతులకు పవర్ గ్రిడ్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిసి రైతులకు గుండెకాయ ను తీసుకెళ్తున్నట్టు ఆవేదనలో రైతులు ఉంటే రైతులకు మద్దతుగా ఉండాల్సిన ప్రభుత్వాలు, రెవెన్యూ అధికారులు బెదిరింపులకు పాల్పడటం ఏమిటన్నారు.అభివద్ధి పేరిట పవర్ గ్రిడ్ నిర్మాణం కొరకు చేస్తున్న సారవంతమైన పంట భూములను బలవంతపు భూసేకరణ చేయడం తగదన్నారు.సుమారు 200 ఎకరాల భూమిని 76మంది రైతుల నుండి సేకరించడమే కాదని 76మంది కుటుంబాలు, వ్యవసాయ కూలీల కుటుంబాలు

పంటపొలాలను పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు రామచంద్రయ్య, గిడయ్య

జీవన్నాదారం కోల్పోతారన్నారు.అధికారులు సాగుకు పనికిరాని భూములలో పవర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టాలని పచ్చని పంట పొలాలో పవర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టడం రైతులను సజీవంగా చంపడమే అని తెలిపారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం 80శాతం రైతులు ఒప్పుకుంటేనే భూములను సేకరించాలని తెలిపారు. మానేకుర్తి, హులేబీడు, కమ్మరచేడు సాగుభూములలో కాకుండా సాగుకు పనికిరాని భూములలో పవర్ గ్రిడ్ నిర్మాణం చేపట్టాలని తెలిపారు.బలవంతపు భూసేకరణ ఆపాలని లేని యెడల రైతులకు మద్దతుగా కలిసోచ్చే పార్టీలను, ప్రజాసంఘాలతో పోరాటం ఉదతం చేస్తామని హెచ్చరించారు.కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు భుపేష్, మండల కార్యదర్శి రామాంజినేయులు రంగన్న రైతులు పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేయాలి

- డ్రైనేజీలో పేరుకుపోయిన పూడికను తీయాలి: సిపిఎం

ప్రజాశక్తి-కోసిగి

మండల పరిధిలోని దుద్ది గ్రామము నుండి మూగలదొడ్డి, చిర్తనకల్, సాతనూర్ మీదుగా తుంగభద్రకు వెళ్లే ప్రధాన రహదారి కి మరమ్మత్తులు చేపట్టి, డ్రైనేజీ కాలువలో పేరుకుపోయిన పూడికను తీయాలని సిపిఎం మండల నాయకులు రాముడు, వీరేష్ కోరారు. ఆదివారం దుద్ది గ్రామాన్ని సందర్శించి ఆ గ్రామస్తులతో కలిసి ఆయా వార్డులో తిరిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో గొర్లి హుస్సేన్ ఇంటి నుండి చావిడి వరకు డ్రైనేజ్ కాలువలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు ఇళ్ళ ముందు నిల్వ ఉండడంతో ,రోడ్డుపై ప్రవహిస్తూ ఉండడం వల్ల ప్రజలు

రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం కోసిగి మండల నాయకులు

ఆ నీటిలోనే నడుచుకుంటూ వెళ్తూ ఇబ్బందులు పడి అసౌకర్యానికి గురవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మురుగునీరు ఇలానే ఉండడం వల్ల డెంగ్యూ , మలేరియా తదితర అంటు వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. దుద్ది గ్రామంలో మీదుగా తుంగభద్ర కు వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయం కావడంతో వర్షపునీరు గుంతల్లో చేరడం వల్ల ఆటోలు మరియు ద్విచక్ర వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే దుద్ది గ్రామంలో డ్రైనేజీ లో పేరుకుపోయిన పూడికను తీసి ,ప్రధాన రహదారికి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సొంత నిధులతో రోడ్డు

ప్రజాశక్తి - ఆదోని

చిన్న పాటి వర్షం వచ్చిన నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది నడిచెందుకు అనుకూలంగా రోడ్డు కు మట్టి వేయించాలని సమస్య పరిష్కరించాలని పలుమార్లు అధికారులు కోరిన ఎవరు పట్టించుకోలేదు. సమస్యను కాలనీవాసులు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి గుడిష ఆది కష్ణమ్మ దష్టికి తీసుకువెళ్లారు. వారి విన్నపం మేరకు ఇటీవల గుడిసె ఆది కష్ణమ్మ కాలనీని సందర్శించి సమస్య తెలుసుకున్నారు. పట్టణంలోని కల్లుబావి నందు రైతులకు అలాగే అటువైపు తిరుగుతున్న ప్రధాన రహదారి ఇటీవల కురిసిన అధిక వర్షాల వల్ల రస్తా గుంతల మయంగా మారింది నీరు నిలిచి ఇబ్బందిగా ఉండడంతో కాలనీవాసులకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. గత పది రోజుల క్రితం టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆదికష్ణమ్మను రైతులు ప్రజలు రహదారికి మట్టి గరుసు వేయించి బాగు చేయాలని కోరడంతో వారి కోరిక మేరకు గుడిసె కష్ణమ్మ ఎర్ర మట్టి వేసి రోడ్డుబాగు చేయించడం జరిగిందని ఆ ప్రాంత వాసులు తెలిపారు. స్పందించిన ఆమె ట్రాక్టర్లతో ఎర్రమట్టి వేయించి రోడ్డు నడిచేందుకు అనుకూలంగా చేశారు. దీంతో రైతులు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ గుడిసె అది కష్ణమ్మకు ధన్యవాదాలు తెలిపారు.

రూ.38,500 పలికిన లడ్డు

ప్రజాశక్తి - చిప్పగిరి

దౌల్తాపురం గ్రామంలో వినాయక చవితి పండుగ పురస్కరించుకొని ఆదివారం నిర్వహించిన వేలం పాటలో రూ.38,500 వినాయకుని లడ్డును కైవసం చేసుకున్నట్లు ఆ గ్రామ వైసిపి సీనియర్ యువ నాయకుడు శేఖన్న తెలిపారు.విలేకరులతో మాట్లాడుతూ పురాతన సాంప్రదాయ పద్ధతిగా వస్తున్న వినాయక చవితి లడ్డు వేలం పాటలో ఈసారి తాను కైవసం చేసుకున్నట్లు తెలిపారు. వినాయక కమిటీ సభ్యులు, గ్రామస్తులు పెద్ద శేఖన్న, కట్ట కింద గుల్లేకులమల్లికార్జున, లక్ష్మీదేవి, మల్లికార్జున, సుధా, లక్ష్మీపతి, బొల్లేని బంగారప్ప,పాల్గొన్నారు.

రేపు పవన్ కళ్యాన్ పుట్టిన రోజు

- జనసేన పార్టీ ఇన్చార్జి వాల్మీకి బి లక్ష్మన్న

ప్రజాశక్తి - మంత్రాలయం

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జన సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ బి లక్ష్మన్న కోరారు. ఆదివారం ఆయన తన స్వగహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్ కళ్యాణ్ జన్మదినం ఈనెల 2న స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. జనసేన నాయకులు, వీర మహిళలు, జనసేన కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఒకే కుటుంబంలో ముగ్గురికి ఉద్యోగాలు

- చదివితే ఉద్యోగాలు వస్తాయని నిరూపించిన కుటుంబం

ప్రజాశక్తి - నందవరం

ఎంత చదివినా ప్రభుత్వ ఉద్యోగాలు రావన్న అపోహ చాలామంది చదువుకున్న వ్యక్తులలో ఉంటుంది.యువకులు ఉద్యోగ వేటలో ఒకసారి విఫలమైతే నిరాశ గురవుతుంటారు. అలాంటి యువకులకు మార్గదర్శకంగా నందవరం గ్రామంలో ఒక కుటుంబం నిలిచింది. చదివితే కచ్చితంగా ఉద్యోగాలు వస్తాయని నందవరం గ్రామానికి చెందిన కురువ పూజారి"కుటుంబం నిరూపించింది. కుటుంబంలో చదువుకున్న ముగ్గురు ఉద్యోగాలు సాధించడం విశేషం.కురువ పెద్ద నాగన్న, హనుమంతహమ్మ దంపతులకు ఆరుగురు సంతానం. ఆ దంపతులు కష్టపడి ముగ్గురి కుమారులను చదివించారు. చదివించిన ముగ్గురుకి ఉద్యోగాలు రావడంతో ఆ దంపతుల ఆనందానికి అవధులు లేవు. వారి మనవడు నరేంద్ర కూడా 20 సంవత్సరాల వయసులోని ఇండియా నేవీలో జాబు రావడం జరిగింది.పెద్ద కుమారుడు కెపి.రంగన్న హెడ్ కానిస్టేబుల్ హైదరాబాద్ లో విధులు నిర్వహిస్తున్నారు. కెపి.నాగరాజు ఇటీవల విడుదలైన మెగా డీఎస్సీలో ఎస్ఎ సోసియల్ జాబ్ సాధించాడు.ఆయనకు

కెపి.రంగన్న, కానిస్టేబుల్

కెపి నాగరాజు టీచర్

కెపి శివకుమార్, టీచర్

ముందుగా రైల్వే జాబు తరువాత సచివాలయ ఉద్యోగం వరించింది. కానీ ఆయన లక్ష్యం టీచర్ కావాలన్నది. మెగా డీఎస్సీలో తనకు ఇష్టమైన టీచర్ జాబ్ సాధించి కలను సహకారం చేసుకున్నారు. చిన్న కుమారుడు శివకుమార్ కూడా మొదటగా రైల్వే జాబ్ సాధించారు.2014లో ఎస్‌జిటి టీచర్ జాబ్ సాధించడం జరిగింది. వారు ముగ్గురు ప్రభుత్వ పాఠశాలలోనే విద్యను అభ్యసించి మంచి ఉద్యోగాలు సాధించారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఉన్నత స్థానాలను చేరుకోగలిగామని వారు తెలిపారు.

ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఉల్లి కొనని వ్యాపారుల లైసెన్సులను రద్దు చేయాలి- మద్ధతు ధర కోసం పోరాటం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లాలో ఉల్లి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు కె .వెంకటేశులు, జి. రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒక క్వింటాలుకు రూ.రెండు వేల నుండి మూడు వేల వరకు ధర వచ్చేలాగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోనే రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా ఉల్లి పంట సాగుఅవుతున్నదన్నారు. గత సంవత్సరం 5900 ఎకరాలు సాగు కాగా ఈ సంవత్సరం 10,800 ఎకరాలు సాగైందని, దిగుబడి కూడా బాగా తగ్గిందని, సాధారణంగా ఎకరాలు 300 బస్తాలు దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం కేవలం 80 నుండి 120 బస్తాల వరకే దిగుబడి వచ్చిందని తెలిపారు. 120 బస్తాలు అంటే 60 క్వింటాళ్లు మార్కెట్లో ధర పలికే ప్రకారమైతే ఒక ఎకరాకు 60 క్వింటాళ్లకు రూ.500 అనగా ఎకరాకు 30,000 మాత్రమే వస్తుందన్నారు. ఇందులో ట్రాన్స్పోర్టు కూలీల ఖర్చులు ఇవన్నీ పోతే చేతికి రూ.18 వేల నుండి 20,000 మాత్రమే వస్తుందన్నారు. రైతు ఎకరాకు అయ్యే ఖర్చు రూ. 1.5 లక్షలదాకా అవుతుందన్నారు. ఫలితంగా అప్పుల పాలవుతున్న పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుత పాలకమండలి , అధికారులు కానీ జాయింట్ కలెక్టర్‌ఉల్లి రైతుల పట్ల సానుకూలంగా స్పందించడం లేదన్నారు. రెండు రోజుల క్రితం రైతులు తెచ్చిన ఉల్లిని వ్యాపారస్తులు కొనుగోలు చేయకుండా పోతే వారిపై ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఫలితంగా రైతులు ఉల్లి పంటను అక్కడే వదులుకోవలసిన పరిస్థితులు వచ్చిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రూ.1200 తక్కువ కాకుండా క్వింటాలకు ధర ఇవ్వండి అని వాటిపై తగిన చర్యలు తీసుకోండని, స్థానిక అధికారులకు పత్రికా ప్రకటన ద్వారా ఆదేశాలు ఇచ్చినప్పటికీ కర్నూల్లో అటువంటి చర్యలు ఏమాత్రం కూడా ఇప్పటివరకు చేపట్టలేదన్నారు. గోడౌన్లను అద్దెకి తీసుకోమని ఉల్లిని ఆరబెట్టమని రైతు బజార్లలో అమ్మి ఆ రకంగా ఉల్లి రైతులకు న్యాయం చేయాలని స్వయానా ముఖ్యమంత్రి గారే చెప్పారన్నారు. కర్నూలు జిల్లా రైతులకు న్యాయమైన ధర ఇవ్వకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు.

హంద్రీనీవా కాలువకు జలహారతి

ప్రజాశక్తి - దేవనకొండ

మల్యాల పంప్ హౌస్ నుండి కుప్పం నియోజకవర్గానికి హంద్రీనీవా నీటిని తీసుకువెళ్లిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పానికి మద్దతుగా ఆదివారం మండలంలోని గుండ్లకొండ హౌస్ వద్ద హంద్రీ నీవా కాలవనీటికి రాష్ట్ర వాల్మీకి ఫెడరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మండల టిడిపి కన్వీనర్ విజయ భాస్కర్ గౌడ్, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు ఆధ్వర్యంలో జల హారతి ఇచ్చారు. వారు మాట్లాడుతూ చెప్పిన మాట ప్రకారమే అటు పులివెందులకు, ఇటు కుప్పంకు కూడా నీళ్లు అందించిన ఘనత రాష్ట్ర సీఎంకు దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి

నాయకులు ఉచ్చిరప్ప, మాజీ ఎంపీటీసీ రామారావు నాయుడు, రాందాస్ గౌడ్, మల్లెపల్లి రంగడు, రాజశేఖర్, మల్లికార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి వడ్డీ నుంచి విముక్తి పొందండి

ప్రజాశక్తి కర్నూలు కార్పొరేషన్

ప్రజలు తమ ఆస్తి పన్నులు, కొళాయి చార్జీలు అలాగే వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ రుసుముల బకాయిలను సత్వరమే చెల్లించి, వడ్డీ నుండి విముక్తి పొందాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30 లోగా చెల్లించే వారికి అపరాధ రుసుము నుండి మినహాయింపు లభిస్తుందని పేర్కొన్నారు. అలాగే ఆలస్యం చేసిన పక్షంలో అపరాధ రుసుము వసూలు చేయడమే కాక, చట్టపరమైన చర్యలు కూడా తీసుకోబడతాయి అని ఆయన హెచ్చరించారు. పన్నులను పురమిత్ర యాప్, సమీప సచివాలయాలు, ఆన్‌లైన్ సేవా కేంద్రాలు, లేదా నగరపాలక సంస్థ కార్యాలయంలో చెల్లించే సౌకర్యం ఉందని కమిషనర్ వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని నగర అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు.

మానవత్వంలో కెపిఎస్ ముందంజ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

మానవత్వం చాటడంలో, దాతృత్వం, సామాజిక సేవా కార్యక్రమాల్లో కర్నూలు ప్రగతి సమితి (కెపిఎస్) ముందంజలో ఉంటుందని అధ్యక్షుడు ఎం. శ్రీహర్ష అన్నారు. ఇటీవల నవాజ్ ఖాన్ పూర్తిగా కోలుకున్నారు. ఈ సందర్భంగా నవాజ్ ఖాన్ కుటుంబ సభ్యులు ఆదివారం బిర్లా కాంపౌండ్‌లోని కెపిఎస్ కార్యాలయంలో శ్రీహర్షను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకున్న చెఫ్ రాఘవును శ్రీహర్ష పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ ప్రజా పోరాట కార్య క్రమాల్లోనే కాకుండా మాన వత్వం, దాతృత్వం, సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా కెపిఎస్ ముందు ఒటుందని పేర్కొ న్నారు. సాటి మనిషికి సాయం చేసినప్పుడు కలిగే అనుభూతి, సంతృప్తి వర్ణ నాతీతమన్నారు. కార్య క్రమంలో కెపిఎస్ సభ్యులు సి.శ్రీనివా సులు, హరినాథ్, మధు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL
JR.CIVIL JUDGE : KURNOOL
I.A.NO.418/2024, IN O.S.NO.264/2015
Harijana Daveed and Others.

...Defendant/Petitioner
VS
Boya Jakkala Krishnaiah and Others.

....Respondent/Plaintiff
Notice to Respondents 1 and 2
Under O.13-R-9 C.P.C

1) బోయ జక్కల కృష్ణయ్య తండ్రి బోయ ఇనగండ్లయ్య
2) బోయ మద్దిలేటి తండ్రి బోయ తిమ్మన్న, ఇద్దరు, ఇనగండ్ల గ్రామం, సి.బెళగల్ మండలం, కర్నూలు జిల్లా.

పై నెంబరు అర్జీలో అర్జీదారులు (ప్రతివాదులు) అర్జీలో కనపరిచిన దస్తావేజులను కోర్టు నుండి వాపసు తీసుకొనుటకు అర్జీ దాఖలు చేసినారు. ఇందులో 1,2 రెస్పాండెంట్లు అయిన మీకు ఆక్షేపణ ఉన్న 12.09.2025వ తేదీన పై కోర్టులో హాజరై తెలుపు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
అన్‌మార్క్‌డ్ డాక్యుమెంట్స్ బేరింగ్ నంబర్-153 to 158 Dt 09.03.2025

కోర్టువారి ఉత్తర్వు మేరకు
కడియాల రామ పుల్లయ్య,
అర్జీదారులపరం అడ్వకేటు,
కర్నూలు.